

# దుప్పటి

కాశీభొట్ల కామేశ్వరరావు

నేనెప్పుడు రాజమండ్రి వెళ్ళినా అమలాపురంలో బస్సెక్కి ఆలమూరు మీదుగాపోయేవాణి. ఒకసారి నారాజమండ్రి ప్రయాణానికి కారు దాటిపోయింది. ఈసారి తప్పనిసరిగా కోటిపల్లి మీదుగా పోవలసివచ్చింది. ముక్తేశ్వరం కారెక్కి రేవులో దిగాను. రేవు టికెట్టు తీసుకొంటున్నాను.

ఒరేయ్ రావుడోయ్. ఒరేయ్ రావుడూ అంటూ పరిచిత కంఠం వినిపించింది.

వెనక్కి తిరిగి చూశాను.

కుంటి సోమన్న కనిపించాడు.

కుంటి సోమన్నది మా వూరే. చిన్నప్పుడు నేను ఎలిమెంటరీ స్కూల్లో చదువుకునేటప్పుడు మా స్కూలు పక్కనే కుంటి సోమన్న పెసరట్ల దుకాణం ఉండేది. ఉదయం పూట పెసరట్లు, మధ్యాహ్నం కొబ్బరి నౌజు పెచ్చ పెచ్చగా మాకు దొరికేవి. ఏదైనా ఒక్క కానీ ఖరీదు. మాకు తోటల్లో దొరికే కొబ్బరి పళ్ళు మేం కుంటి సోమన్నకే అమ్మేవాళ్ళం. అప్పుడు కొబ్బరిపండు కూడా కానీ ఖరీదే. ఇలా కొబ్బరి పండిచ్చి అలా కొబ్బరి నౌజు తీసుకొనేవాళ్ళం.

కుంటి సోమన్నకి ఆ కుంటితనం ఎలా వచ్చిందో నాకు తెలియదు. కాని నేను నారింజ కాయలు వల్చుకొని తింటున్నా, నిమ్మకాయల రసం నీళ్ళలో కలుపుకొని త్రాగుతున్నా మా మేనత్త వచ్చి ఒరేయ్ రామూ, సోమన్న ఇల్లాగే తిన్నాడు వాడి కాళ్లు పడిపోయాయి అని బెదిరించేది. ఆటలమ్మ చూపినప్పుడు అపథ్యం చేశాడు అంచేత కాళ్ళు పడిపోయాయి అని మా అమ్మ అనేది.

కుంటి సోమన్నకు అందుచేత పెళ్ళి కాలేదు. ఉచ్ఛిష్ఠ గణపతి ఉపాసన ఉన్నవాడిలాగ ఆ ఒక్క జందెంముదని నివీతిగా వేసుకొని ఓ గోచీయో, అంగవస్త్రమో కట్టుకుని పెనందగ్గర కూర్చొనేవాడు.

ఈ వ్యాపారంలో లాభం తియ్యాలనే ఆశ కుంటి సోమన్నకూ లేదు. ఆ వీధి లోనే అతని అన్నదమ్ములున్నారు. రోజుకో యింట్లో భోజనం చేసేవాడు. కాని నల్లమందు అలవాటొకటి ఉండడంవల్ల, దానికి రోజూ ఓ అణా కావలసి వచ్చేది. ఈ దుకాణంవల్ల కుంటిసోమన్న ఆశించేది రోజూ ఆ ఒక్క అణామాత్రమే.

అప్పుడప్పుడు అనగా మా దగ్గర డబ్బులు లేనప్పుడు, మాకు తినాలని ఉన్నప్పుడు సోమన్న చూడకుండా సరుకులు ఎత్తుకుపోవాలని ప్రయత్నించేవాళ్ళం. కాని మా ప్రయత్నం సఫలమైనా అది సోమన్న దృష్టిలో పడేది. వెర్రి వెధవల్లారా! కావాలని ఏడవకూడదూ. నేనే ఇద్దునుకదా! అంటూ మిగిలినవి తక్కిన కుర్రాళ్ళ కిచ్చేవాడు. ఈ విధంగా ఉచితంగా కూడా సోమన్నదగ్గర మేం తీసుకొంటూ వుండేవాళ్ళం.

సోమన్న కొట్టుదగ్గరే కాలువ. మేం ఈత లీదేందుకు చాలాసాయం చేసేవాడు. కుంటివాడనే మాటేగాని కాలువ ఈ మూల నుంచి ఆ మూలకు నాలుగు బారల్లో ఈదేశేవాడు. మాకు చిన్న చిన్న గోచీలు పెట్టి ఈత కొట్టడం నేర్పేవాడు.

సోమన్న కొట్టు ఎదురుగుండా వున్న చింత చెట్టుక్రింద పాకలేసి రాముణ్ణి ప్రతిష్ఠించి భజన చేసేవాళ్ళం. ప్రసాదాలు తయారుచేయడం పంచడం సోమన్న పని.

ఈ విధంగా సోమన్న మా బాల్య జీవితంలో ఓ భాగం ఐపోయాడు. ఆ సోమన్న నాకిప్పుడు కోటిపల్లి రేవు దగ్గర కనపడ్డాడు.

"ఇలాగ ఎక్కడికి పోతున్నావ్?"

అన్నాడు

"రాజమండ్రి. ఉద్యోగం చేస్తున్నా



నక్కడ" అన్నా అబ్బో పెద్దవాడవయ్యావు రోయ్ అన్నాడు." హృదయపూర్వకమైన సంతోషంతో.

"ఇక్కడున్నావేం" అన్నాను.

ఈ ప్రశ్న తెలివితక్కువ ప్రశ్న. ఎదురుగుండా పెనం పెసరట్ల పొయ్యి కనబడుతూనే వున్నాయి.

రోజులు మారిపోయిన తర్వాత ఆ కుంటివాడుకూడా తన పొట్ట తానుపోషించుకోవలసి వచ్చింది. ఓ రోజున తన పెనం

అట కాడా పుచ్చుకొని మా పూరు నుంచి ఇక్కడికు వచ్చేశాడు సోమన్న.

"ఇప్పుడిక్కడేకుంటున్నాను పెసరట్లు కాల్చనా? ఇంకా నీకు లాంచికి అరగంట పైముంది" అంటూ పెనం మీద రెండు పెసరట్లకు పిండి పోశాడు

ఒక్కసారి మంట ఎగదోసి" ఒరేయ్ విశ్వనాథంగాడు ఎక్కడున్నాడురా ఇప్పుడు?" అన్నాడు.

విశ్వనాథం మా చిన్ననాటి స్నేహితులో ఒకడు. మాకు నాయకుడుగా ఉంటో ఉండేవాడు.

"హైదరాబాదులో రైల్వేలో పనిచేస్తున్నాడు" అన్నాను.

"ఎప్పుడూ ఎవరూ కనబడరురా" అన్నాడు పెసరటుమీద నెయ్యి పోస్తూ

"ఒక్క చంద్రమతి మాత్రం రెండు మూడు నెలలకోసారి కనబడుతుంది. దాని అత్తారు కోటపల్లే. ఇద్దరు పిల్లలు. పలకరించి పోతూ వుంటుంది" అన్నాడు.

నా మనస్సు ఆ చిన్ననాటి తరగతి గదిలో విహరిస్తూ వుంది. ఇంతలో లాంచి హారన్ నా చెవుల్లో పడింది. ఉలిక్కిపడ్డాను

ఫరవాలేదులే. ఇంకా పావుగంట ఉంటుంది. అంటూ పెసరట్లు ఆకులో పెట్టి నాకిచ్చాడు. నాకోసం ప్రత్యేకంగా కాల్చాడు. నేతి వాసన ఘుమఘుమలాడుతోంది. రెండు తిన్నాను. ఓ అర్ధ రూపాయి తీసి ఆ సోమన్నకిచ్చాను. పుచ్చుకోలేదు. నా కిచ్చేశాడు.

"ఉంచు' అన్నాను.

"వద్దు డబ్బెందుకురా నాకు" అన్నాడు

"ఒరేయ్ రాఘూ, చలికి మహా బాధపడుతున్నాను ఈ గోదావరి వార. దుప్పటీగుడ్డ ఏదైనా వుంటే పడేదూ" అన్నాడు.

ఈ అడగడంలో యాచనా, దైన్యం ఏమిలేదు. ఆ పమ్మి తుడు అడిగినట్టే అడిగాడు. నా సంచీలో ఓ దుప్పటీకూడా ఉంది కాని అది కొని వారం రోజులు కూడా కాలేదు ఖరీదు పది రూపాయలు. అది ఇవ్వమని ఒక్కసారి అనిపించినా నాలుక యాంత్రికంగా "సరే ఈసారి వచ్చినప్పుడు తెస్తాలే" అంది.

గబగబా సంచీ పుచ్చుకుని పోయి లాంచిలో కూర్చున్నాను. లాంచి గోదావరి కెరటాలమీద ఉయ్యాల లూగుతూ పోతూ వుంది. నా మనస్సుకూడా వివిధ భావాలతో అలాగే ఊగిసలాడుతూ వుంది. చిన్ననాటి స్నేహితులు ఒక్కొక్కళ్ళే జ్ఞాపకానికి రాసాగారు.

చంద్రమతి ఇక్కడే కోటపల్లిలో

## క్రాంతి గోళాలు

కమ్ముకొస్తున్న కలలమీద
కనురెప్పల కత్తిపోట్లు.
ముంచుకొస్తున్న నిద్రమీద
చైతన్యం గిరవాట్లు.
ఈ రాత్రి కనవలసింది
కలలను కాదు
క్రాంతి గోళాలను.
ఈ నాడు కావలసింది
డోల ఊపడం కాదు
నిద్ర లేపడం.
జోల పాడడం కాదు
మేలు కొలపడం.

అనుక్షణం జాగరణం.
అహరహం సంఘర్షణం.
ఊపిరితిత్తుల్లో ఊదవలసింది
అనిలం కాదు అనలం.
మత్తు మరిపింపజేస్తుంది
చిచ్చు నడిపింపజేస్తుంది.
ముసలి సంధ్య పడుకో బెడుతుంది
పడుచు సంధ్య పడగెత్తిస్తుంది.
పడగెత్తే ఆ పడుచుదనం
ప్రగతి శక్తులకు మూలధనం.
అదే విప్లవాంతిని రగిలించే
ఆరిపోని అలిసిపోని ఇంధనం
మురికి బుద్ధులు కుట్రపన్నుతున్నా
కిరాతకులు ఉరులు పేనుతున్నా
చిక్కు పడదు ఆ కాంతి
బిక్కవోదు ఆ విప్లవాంతి.
అది మోగుతూనే వుంటుంది
ఉదయ ఢమరు నాదమై.
అది సాగుతూనే వుంటుంది
నవ సమాజవాదమై.
అప్పుడుండవు తెల్లటి చీకట్లు
అప్పుడుండవు నల్లటి ముచ్చట్లు.
అప్పుడుండవు కాంతి శిశువును
కరుచుకునే ఇనుప కట్లు.

—డాక్టర్ సి. నారాయణరెడ్డి

## దుప్పటి

కాపురం చేసుకొంటూ వుంది. మా తరగతిలో చంద్రమతి పెద్దపిల్ల. పదమూడేళ్లుండేవి. నల్లగా నిగనిగలాడుతూ వుండేది. నేనెప్పుడూ చంద్రమతి దగ్గరగా కూర్చునేవాణ్ణి. ఆదిలక్ష్మి అంటే నాకు విపరీతమైన భయం. కుద్ద మొద్దు పిల. నా లెఖ్ఖలు చూసి వేసేది మేష్టారితో చెప్పేందుకు కదిలానో మొట్టికాయలు మొట్టేసేది- బుగ్గనులుముబు నులిమేసేది. కస్సుబుస్సులాడే ఆ ముఖం ఇప్పటి నేను మరచిపోలేను. ఆదిలక్ష్మి ముఖం ఎంత ధుమధుమలాడేదో శ్యామల ముఖం అంత సంతోషంతో ఉండేది ఎప్పుడూ. శ్యామలా, మంగాయీ అప్పచెల్లెళ్ళు. వాళ్ళింటిదగ్గర మెట్టతామర పువ్వులుండేవి. సుందరికి ఆ పువ్వులంటే ఇషం సుందరికోసం ఆ పువ్వులు కోసుకు వచ్చేవాణ్ణి. సుందరి ఇప్పుడెక్కడుందో. ఇప్పటికి నలుగురు పిల్లల తల్లై ఉంటుంది. వేసగి వెన్నెల రాత్రుళ్ళలో మెసూరు గోవా మామిడిక్రింద కూర్చుని సుదూరాన నుంచి వినిపించే గ్రామదేవత జాతర డప్పులు వింటూ ఎన్నెన్నో కథలు చెప్పుకునే వాళ్ళం. గుర్నంగాడు, ఆంజనేయులి వేషం వేసే ఆ సత్యంగాడు వీళ్ళందరూ ఇప్పుడెక్కడికిపోయారో? ఇంక మళ్ళీ ఈ జీవితంలో అల్లా ఆడుకోగలనా?

నా మనస్సు ఆ కరిగిపోయిన రోజుల గురించి ఆలోచిస్తోంది. ఆ స్మృతులన్నీ నాలో కుంటి సోమన్న రెచ్చగొట్టాడు. ఆ తియ్యని రోజుల నన్నింటిని మళ్ళీ జ్ఞావకానికి తెచ్చాడు. దీనికి కృతజ్ఞతగా సోమన్నకు నేనేమిచ్చాను?

నా దగ్గర డబ్బులు డాక్టర్లకంటెముందు రచయితలే పొందుతూ వుంటారు. రచయితవలె మధుర స్మృతుల్ని నాలో రేపిన సోమన్న ఏమి పొందాడు? ఒక్క దుప్పటీ గుడ్డ అడిగాడు. అదికూడా ఇవ్వలేని క్షుద్రుణ్ణయ్యాను. ఒక్కసారి ఒడ్డువైపు చూశాను. సోమన్న ఉండే పాక చిన్నదిగా నాకు కనిపిస్తూనే వుంది. ఇక్కడ అందరూ సోమన్నను ఎరుగుదురు. లాంచి దిగి ఏ పడవవాడ చేతికైనా దుప్పటి ఇచ్చి పంపించాలని అనుకొన్నాను- కాని ఆ కొత్త దుప్పటి వాడివ్వక అపహరిస్తే? నా కెందుచేతో సోమన్న సొమ్ము ఎవడూ అపహరించడు అని అనిపించలేదు.

కారులో కూర్చున్నాను. రోడ్డు కిరువైపులా ఉన్న సువిశాలమైన సస్యశ్యామల ప్రదేశాలు కన్నుల పండువుగా ఉన్నాయి. మా బడికి ఆవలిప్రక్క ఇలాంటి చేలే ఉండేవి. పెసర పైరు వేసినప్పుడు మేము ఆ చేలలోకి వెళ్ళేవాళ్ళం. ఇంత పెసరరొటపీకి కాల్చుకొని ఆ కాయలు వల్చుకొని తినేవాళ్ళం. ఆ రుచి ఈ నాటికీ నాకు మరపునకు రాదు. ఇప్పుడు ఆ బడిలో-ఆ వీధిలో నా మనస్సు తిరుగుతూ వుంది. ఆ వీధిలో పుట్టి పెరిగిన అనేకమంది పిల్లల్ని నేనెరుగుదును. ఆడ పిల్లలు చాలామంది అత్తవారింటికి వెళ్ళిపోయి ఉంటారు. వారి స్థానే క్రొత్త కోడళ్ళతో ఆ కొంపలు కలకల




## దుప్పటి

లాడుతూ వుంటాయి. మాబడికి మళ్ళీవీళ్ళు పిల్లల్ని సరఫరా చేస్తూవుంటారు కాబోలు. ఇల్లాటి స్మృతులతో నా కారు ప్రయాణం సాగింది.

రాజమండ్రిలో దిగి నా పనిలో నేను ప్రవేశించినా ఈ భావోన్మత్తత, దీనికి కారణమైన సోమన్నా నా మనస్సు విడచి పెట్టలేదు. మరునాటి మధ్యాహ్నానికిగాని ఆ స్మృతులను మరచిపోలేకపోయాను.

ఓ నెల గడిచింది. ఒకసారి అమలాపురం రావలసి వచ్చింది. ఈ సారి కోటిపల్లి మీదుగానే వెళ్ళాలని నిశ్చయించుకొన్నాను. నా చిన్ననాటి స్నేహితుడక్కడ ఉంటాడు. వాడి కోరిక నెరవేర్చడానికి దుప్పటీ కొనాలనుకున్నాను. నా దగ్గర పుష్కలంగానే డబ్బు ఉంది. కాని ఆ కుంటివాడికి పెద్ద ఖరీదైన దుప్పటి ఎందుకనే పిసినారి భావం ఏదో వచ్చేసింది. ఆరు రూపాయలిచ్చి ఓ దుప్పటి కొన్నాను. బస్సెక్కి బయలుదేరాను.

ఏదో ఇంటికిపోతున్న మనస్సేమో సోమన్నను గురించి చిన్ననాటి ముచ్చటలను గురించి అంతగా ఆలోచించలేదు. కారు కోటిపల్లి వచ్చేటప్పటికి తొమ్మిదైంది. లాంచి గోదావరిలో సగందూరం వచ్చేప్పటికి సోమన్న పాక కనబడుతూ వుంది. నేను వెడుతూవుంటే సోమన్న పిలుస్తాడు– పిలవకపోయినా పాకలోకి పోయి, రెండు నేతి పెసరట్లు కాల్పించుకొని తిని దుప్పటి ఇవ్వాలని అనిపించింది. లాంచి ఒడ్డుకు చేరింది. సంచీ పుచ్చుకొని తొందరగా బయలుదేరాను.

సోమన్న పాక దగ్గర ముగురు నిలబడి ఉన్నారు. అందులో వెంకటప్పయ్య ఒకడు. వెంకటప్పయ్య సోమన్నకు అన్నగారే.

"ఏమోయ్ ఇల్లా వచ్చావ్?" అన్నాను వెంకటప్పయ్యను ఉద్దేశిస్తూ.

కాని వెంకటప్పయ్య నా మాటలకు బదులు చెప్పకుండానే పాకలోకి వెళ్ళాడు. నేను కూడా వెనకాలే పాకలోకి వెళ్ళబోయాను. కాని ఎవడో నా జబ్బ పట్టుకొని ఆపాడు. నేను ప్రక్కకు తిరిగి "పోం?" అన్నాను. "సోమన్నగారు సచ్చిపోయారు. రేత్రినాలుగు డోకులెళ్ళాయి" అన్నాడు.

నాకు అంతా అర్థమైంది. అలాగే నిర్ఘాంతపోయి చూస్తున్నాను.

వెంకటప్పయ్య సోమన్న శవాన్ని ఇవతలికి తెచ్చాడు. చాలా నీరసించి పీక్కుపోయి వుంది ఆకృతి. గంపలో కూర్చోబెట్టి "ఏదైనా గుడ్డ కప్పాలి" అన్నాడు వెంకటప్పయ్య.

నేను తలవంచుకుని నాసంచీలోని కొత్త దుప్పటి తీసి సోమన్నకు కప్పేను. ★



ఎగరడానికెందుకే తొందర?  ఫొటో : యం. బి. ఎస్. చారి. గుంటూరు–2


## కాయకల్ప చికిత్స

హృదయము వూపిరితిత్తులు, పైత్యకోశము పూర్తిగా శిథిలము కాకుంటే రోగి తిరిగే స్థితిలో వుంటే ఈ చికిత్స పొందవచ్చును. 3 లేక 4 మాసములలో ఈ చికిత్సవల్ల దేహములోవున్న అన్ని వ్యాధులు నివారణ మగుటయేగాక సగము వయస్సు కలిసివచ్చును. అనగా 60 సంవత్సరములవారు ఈ చికిత్స పొందిన 30 సంవత్సరముల ప్రాయములో వారికివున్న యవ్వనము కలుగును. ఇంగ్లీషు ఆయుర్వేద యునాని హోమియోపతి ప్రకృతి వైద్యంవల్ల సాధ్యముకాని అన్నివ్యాధులు నివారణ మగును. వివరములు కోరువారు పోస్టు ఖర్చులకు రెండు రూపాయలు పంపవలయును.

★

శ్రీ యోగాశ్రమము

పెదవాల్తేరు,

విశాఖపట్టణము–3